విద్యతోనే ఉన్నత స్థానం సాధ్యం


మాట్లాడుతున్న అన్నా రాంబాబు

మార్కాపురం: విద్యతోనే ఉన్నతస్థానానికి చేరుకోవచ్చని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా సాగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అన్నా రాంబాబు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులు తాము నేర్చుకున్న చదువు నిత్య జీవితంలో ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. విలాసాలు, మోసాలకు పాల్పడి జీవితంలో దిగజారిపోవద్దన్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు నెరవేర్చాలన్నారు. ఫేర్‌వెల్ పార్టీ జీవితంలో మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోవాలని, ఏ స్థాయిలో ఉన్నా మిత్రులను మర్చిపోవద్దన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ అనీల్‌కుమార్, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల గ్రామోత్సవం


గ్రామోత్సవంలో సీతారామస్వామి

తర్లుపాడు: మండలంలోని కొండారెడ్డిపల్లిలో గురువారం రాత్రి సీతారాముల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గురువారం స్వామివారి కల్యాణం అనంతరం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. జై శ్రీరామ్ నినాదాలతో గ్రామమంతా మారుమోగింది. భక్తులకు పానకం, వడపప్పు అందించి, అన్న సంతర్పణ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

విద్యుదాఘాతంతో గేదె మృతి


ప్రమాదంలో మృతి చెందిన గేదె

బేస్తవారిపేట: ఈదురుగాలుల ధాటికి తెగిపడిన విద్యుత్ తీగ తగిలి ఓ గేదె మృత్యువాత పడింది. ఈ సంఘటన బేస్తవారిపేట మండలంలోని ఆర్.కొత్తపల్లె నుంచి పూసలపాడు వెళ్లే మార్గంలో ఉన్న పొలాల్లో శుక్రవారం చోటుచేసుకుంది. ఆర్. కొత్తపల్లె ఎస్సీ కాలనీకి చెందిన పరిశపోగు అబ్రహాం తన పాడి గేదెను మేత కోసం పొలానికి తోలాడు. ఈ క్రమంలో తెగిపడిన విద్యుత్ తీగ తగిలి గేదె అక్కడికక్కడే మృతిచెందింది. రూ.65 వేల విలువైన గేదె మృతి చెందడంతో బాధిత రైతు బోరున విలపిస్తున్నాడు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని వేడుకొంటున్నాడు.

ముగిసిన సీతారాముల కల్యాణ బ్రహ్మోత్సవాలు


ఏకాంత సేవలో సీతారాములవారు

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్లలో సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో కల్యాణ బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. వసంతోత్సవం వేడుకగా సాగింది. ఉభయదాతలు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. దేవస్థాన ధర్మకర్తలు పేర్ల వెంకటసుబ్బారావు, వెంకటరాధాకృష్ణమూర్తి, వెంకటచెన్నయ్య, శ్రీరాములు, భవాని శ్రీనివాసులు, కృష్ణయ్య, రమేష్, సత్యం, కిరణ్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డ్రగ్స్ రహిత ఏపీపై విద్యార్థుల ర్యాలీ


కంభంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కంభం: విద్యార్థులు చదువుకోవాల్సిన వయసులో వ్యసనాలకు బానిసలుగా మారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని వాసవి విద్యాసంస్థల కరస్పాండెంట్ గోళ్ల సుబ్బరత్నం పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ నిర్వహిస్తున్న డ్రగ్స్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా వాసవీ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, ఫార్మసీ, ఇంటర్ విద్యార్థులు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డ్రగ్ యూజర్- లైఫ్ లూజర్ అని ప్లకార్డులు ప్రదర్శిస్తూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రాము, ఇంటర్ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటిడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవాలి

గిద్దలూరు రూరల్: పిల్లల్లో ఊబకాయం తగ్గించేందుకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేలా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేయాలని స్థానిక సీడీపీఓ బి.జ్యోతి పేర్కొన్నారు. పట్టణంలోని గణేష్‌నగర్‌లో గల అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి మెరుగుపరిచేలా తల్లులకు సలహాలు ఇవ్వాలని సూచించారు. గర్భిణి దశ నుంచి ప్రసవించిన రెండేళ్ల వరకు వారి ఆరోగ్య స్థితిని మెరుగుపరిచేలా చూడాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ సిబ్బందిని ఆదేశించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

కొనకనమిట్ల: ఆరోగ్యకరమైన జీవన విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ సుధా మారుతి స్పష్టం చేశారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గొట్లగట్టు కేజీబీవీ బాలికలకు పోషకాహారం, ఊబకాయంపై అవగాహన కల్పించారు. మంచి ఆహారపు అలవాట్లపై విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఆవరణలో ఆకుకూరలు, కూరగాయలు పెంచేందుకు అవసరమైన విత్తనాలు అందజేశారు. ఆరోగ్యకరమైన జీవన విధానంపై స్లోగన్స్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సరిత, ప్రసన్న, ఉపాధ్యాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లును వెనక్కి తీసుకోవాలి


కంభంలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

కంభం: కేంద్ర ప్రభుత్వం ముస్లింలపై విద్వేషాన్ని చిమ్ముతూ ఇటీవల పార్లమెంట్‌లో ఆమోదించిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలని సీపీఎం నాయకుడు అన్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక అర్బన్‌కాలనీలోని మూడు మసీదుల ముస్లింలు నమాజ్ అనంతరం కాలనీలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. లౌకిక పార్టీలుగా చెప్పుకునే టీడీపీ, జనసేన తమ స్వార్థ ప్రయోజనాల కోసం వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు తెలపడాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. సీపీఎం సహా ప్రతిపక్షాలు బిల్లును అడ్డుకునేందుకు గట్టిగా ప్రయత్నం చేశాయన్నారు. కొత్త కొత్త చట్టాలు చేస్తూ దేశ ప్రజల మధ్య చిచ్చుపెట్టవద్దని కోరారు. కార్యక్రమంలో ఎంపీజే పట్టణ కార్యదర్శి నాయబ్ రసూల్, కరీముల్లా, హుస్సేన్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

మార్కాపురం: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు శుక్రవారం మార్కాపురం డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ నాయకులు బీఎస్‌రెడ్డి, డిపో సెక్రటరీ కాశయ్య, టి.మల్లికార్జునరావు మాట్లాడుతూ.. 2019/1 సర్క్యులర్ అమలు చేయాలని, అన్ని కేటగిరీల్లో ప్రమోషన్లు ఇవ్వాలని, రిటైర్డు ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.రామిరెడ్డి, రవి, టీవీఎస్ రావు, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

28న వెలుగొండ నిర్వాసితులతో చలో అమరావతి

మార్కాపురం టౌన్: వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయాలని, ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు చేసి ప్రాజెక్టు మిగులు పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతూ ఈనెల 28న చలో అమరావతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాసితుల సంఘం కన్వీనర్ గాలి వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి ప్రదర్శన నిర్వహించి మాట్లాడారు. సుమారు 11 గ్రామాల ప్రజలు నిర్వాసితులుగా మారారని, వెంటనే పరిహారం ఇవ్వాలని కోరారు. నిర్వాసిత గ్రామాల్లో 18 ఏళ్లు దాటిన యువతీ యువకులకు పరిహారం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కర్నాటి రంగారెడ్డి, టి.మల్లికార్జునరావు, జి.వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిరావ్ పూలే జయంతి


బీసీ భవన్‌లో పూలే చిత్రపటానికి నాయకుల నివాళి


గొట్లగట్టు కేజీబీవీలో..


కంభంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మార్కాపురం టౌన్: మహాత్మ జ్యోతిరావ్ పూలే జయంతిని శుక్రవారం మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీసీ భవన్‌లో బీసీ క్రమశిక్షణ సంఘం జాతీయ కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పాలెం చెంచయ్య, టీపీ వెంకటేశ్వర్లు, వి.శ్రీనివాసులు, జీవీ సుబ్బారావు, సీహెచ్ శ్రీనివాస్, రాంబాబు నివాళులర్పించారు. బీజేపీ బీసీ సెల్ నాయకులు ఆధ్వర్యంలో కరెంటు ఆఫీసులోని పూలే విగ్రహానికి బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో పూలమాలలు వేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు అధ్యక్షత జ్యోతిరావ్ పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. డీన్ మస్తానయ్య, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఫార్మసి కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజా జయరావు అధ్యక్షతన పూలే జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్‌సునీత, అశోక్‌బాబు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: పేదరికాన్ని జయించేందుకు విద్య దోహదపడుతుందని చాటిచెప్పిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని గొట్లగట్టు కేజీబీవీ ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ పేర్కొన్నారు. శుక్రవారం గొట్లగట్టు కేజీబీవీలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే, కస్తూర్బా గాంధీ చిత్రపటాలకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు నివాళులర్పించారు. పూలే జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు.

కంభం: కంభంలో పూలే చిత్రపటానికి బీసీ నాయకుడు వేముల రాజు, తురక శేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి షాలెంరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు ఉప్పు రంగనాయకులు, ఉమా మహేశ్వరరావు, సుబ్బారావు, దస్తగిరి, ఎమ్మార్పీయస్ నాయకులు నేదరపల్లి జయరాజ్ పాల్గొన్నారు. బహుజన పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు దాసరి యేబు ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీను, నాగరాజు, ముజీబ్, వెంకటేశ్వర్లు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

బొప్పాయి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



గొల్లపల్లిలో దెబ్బతిన్న బొప్పాయి తోటను పరిశీలిస్తున్న అన్నా రాంబాబు

- వైఎస్సార్ సీపీ మార్కాపురం సమన్వయ కర్త అన్నా రాంబాబు

పొదిలి రూరల్: అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా వెంకట రాంబాబు కోరారు. శుక్రవారం పొదిలి మండలంలోని గొల్లపల్లి, చిదంబరంపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న బొప్పాయి తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ.. పాములపాడు, చిదంబరంపల్లి, గొల్లపల్లి, కుంచేపల్లి, మల్లవరం గ్రామాల్లో దాదాపు 135 ఎకరాల్లో బొప్పాయి సాగు చేశారన్నారు. గురువారం కురిసిన అకాల వర్షం, ఈదురుగాలుల ధాటికి బొప్పాయి తోటలు అధికంగా దెబ్బతిన్నాయన్నారు. పంట చేతికొచ్చే సమయంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని, రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కొత్తపులి బ్రహ్మరెడ్డి, కోదండరామిరెడ్డి, రైతులు ఉన్నారు.

రంగనాయకుని దర్శనం.. పరమ పవిత్రం

- నల్లమలలో సుందర నిలయం నెమలిగుండ్ల ఆలయం
- 12,13,14 తేదీల్లో రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు


నెమలిగుండ్ల రంగనాయకస్వామి క్షేత్రం


నెమలిగుండ్లరంగనాయకస్వామి


ఆదిలక్ష్మిఅమ్మవారు


రంగనాయకస్వామి తెప్పోత్సవం(ఫైల్)

రాచర్ల: రాచర్ల మండలంలోని జేపీ చెరువు గ్రామానికి 7 కిలోమీటర్ల దూరంలో గల దట్టమైన నల్లమల అడవుల్లో వెలసిన నెమిలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఏటా చైత్ర శుద్ధ పౌర్ణమి రోజున ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తారు. రంగరంగ వైభవంగా నిర్వహించే స్వామివారి కల్యాణం, తెప్పోత్సవానికి తరలివచ్చే వేలాది మంది భక్తులతో నల్లమల అటవీ ప్రాంతం జనసంద్రంగా మారుతుంది.

బ్రహ్మోత్సవ కార్యక్రమాలు

నమ్మకానికి నిలయమైన నెమలిగుండ్ల క్షేత్రంలో 1994 నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం అంకుర్పాణ, ధ్వజారోహణం, శేషవాహనం, హనుమంత వాహనం, 13న ఉదయం 11 గంటలకు రంగనాయకస్వామి కల్యాణం, 14న ఉదయం 9 గంటలకు స్వామివారి తెప్పోత్సవం, దివ్యరథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ మల్లవరపు నాగయ్య తెలిపారు.

ఆలయానికి చేరుకునేదిలా..

నెమలిగుండ్ల క్షేత్రానికి గిద్దలూరు నుంచి కొండపేట, అంబవరం, వెల్లుపల్లి మీదుగా భక్తులు చేరుకోవచ్చు. అదే విధంగా గిద్దలూరు నుంచి రాచర్ల, అనుములపల్లె, జేపీచెరువు మీదుగా వెళ్లవచ్చు. అలాగే కంభం నుంచి తురిమెళ్ల, అక్కపల్లె, చోళ్లవీడు, చినగానిపల్లె, జేపీ చెరువు గ్రామాల మీదుగా రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు.

సత్రాల్లో అన్నసంతర్పణ

బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు మూడు రోజులపాటు ఆలయ ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయల కాపు, బలిజ, గోపాలకృష్ణ యాదవ, కాశీనాయన రెడ్ల, యోగివేయన రెడ్ల, బ్రాహ్మణ, ఆర్యవైశ్య, విశ్వబ్రహ్మణ, మేదర సత్రాల్లో అన్నసంతర్పణ చేస్తారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపట్టాం. దేవస్థానం ప్రాంగణంలో భక్తుల కోసం అదనంగా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం. దేవస్థానానికి వెళ్లే మార్గంలో అడుగడుగునా దాతల సహకారంతో మజ్జిగ, మంచినీరు పంపిణీ చేస్తాం.

– మల్లవరపు నాగయ్య, ఈఓ, రంగస్వామి దేవస్థానం


దేవస్థానం వద్ద అందాల గుండ్లకమ్మ జలపాతం